మోసం చేసిన భర్త తిరిగొస్తే ఆమె కూతురు అతన్ని తండ్రిగా అంగీకరించిందా?

# ఎన్.హరిప్రియ కథ

# నిర్ణయం

రాత్రినంతా గాడాంధకారంలో ముంచి, నిద్రపుచ్చి తిరిగి తన కర్తవ్యంగానే జనచైతన్యాన్ని కలిగించేందుకు, జీవచైతన్యం కల్పించేందుకు తూరుపు దిక్కున ఒక ఉదయరేఖ వెలుగై చీల్చుకు వచ్చినవేళ.... ఎండి బీటలు వారిన భూమిపై తొలిసారిగా ఓ వాన చినుకురాలి మనసుపై మంచు బిందువులా మారినవేళ... వసంత ఋతువు ఆగమనానికి గుర్తుగా కోయిల కంఠం సవరించుకున్న వేళ...

గుండె పులకరించి, పరవశించి... హృదయం స్పందించి, ద్రవించి, ప్రవించి.... మనసు లోలోపలి పొరల్లో ఏ మూల లోతుల్లోనో ఒదిగి దాగి కొన్నేళ్ళుగా నిక్షిప్తమై వున్న... బాధో... మమతో పెల్లుబికి గుండె పొరల్ని చీల్చుకుని కన్నీటి బొట్టుగా మారి... కన్నుల్లోనుండి తన్నుకొస్తే... అది ఆనంద బాష్పమా?... లేక వరదై ముంచెత్తే బాధా ప్రవాహమా?! దానికేది అర్థం?

ఎవరు చెప్పగలరు నిర్వచనం???

* * *

గదిలోకి ప్రవేశిస్తూనే ఎయిర్‌కూలర్ ఆన్‌చేసి ఈజీఛెయిర్‌లో కూర్చుని తలవెనక్కి వాల్చి సీలింగ్‌వైపు దృష్టి సారించి అక్కడే చూపు నిలిపింది జస్టిస్ కోమలాదేవి.

ఎన్నో దగాపడిన బ్రతుకుల్లో వెలుగునింపిన జస్టిస్ కోమలాదేవి!!

ఎన్నో దెబ్బతిన్న హృదయాలను సేదతీర్చిన జస్టిస్ కోమలాదేవి!!

— ఎన్నో భంగపడిన జీవితాల్లో చీకటి తొలగించిన జస్టిస్ కోమలాదేవి!!



ఎన్నో విడిపోయిన జంటలకు న్యాయం చేకూర్చి ఒక్కటి చేసిన జస్టిస్ కోమలాదేవి!!

తన విషయానికొచ్చేసరికి?...

ఆమె హృదయాన్ని కుమ్మరి పురుగులా తొలిచేస్తూంది ఒకే ఒక ప్రశ్న!

అది తన భవితవ్యానికి సంబంధించినది.

ఆమె ఆలోచనలు గతాన్ని ఆమె ముందుకు తెచ్చాయి.

లోకులు కాకులై... పలుగాకులై సమాజంగా మారి భవిష్యత్తును భయంకరంగా సృష్టించి అందులోకి చూడమని నిర్బంధం చేస్తూ.

భర్త త్యజించిన ఆడదానికైనా, భర్తను త్యజించిన ఆడదానికైనా నేరమంతా ఆడదానికే ఆపాదించి ఒకే బిరుదు ఓ.కె చేస్తుంది. తప్పంతా ఆడదానికే అంటగట్టి సమాజం నుండి తరిమికొట్టే ఆ సమాజమే ఎన్ని తప్పులుచేసినా మగవాణ్ణి సంఘంలోకి సాదరంగా ఆహ్వానిస్తుంది. సానుభూతి చూపించి అదే 'రాజనీతి'గా పరిగణిస్తుంది.

తన బిడ్డ!...

లాయర్ విరజ!...

అదే భవిష్యత్తువైపు నిలబడి గతాన్ని చూపుతూ ధర్మదేవతలా నిలదీసి ప్రశ్నిస్తోంది.

''మమ్మీ! నీ భవిష్యత్తు గురించి నువ్వెలాంటి నిర్ణయం తీసుకున్నా నాకేం అభ్యంతరం లేదు. కాని... నీ గతాన్ని ఒక్కసారి గుర్తుతెచ్చుకో. గతాన్ని నువ్వు మరచిపోగలిగితే నాకేం అభ్యంతరం లేదు. అలా మరచిపోగలవా? నువ్వు మరచిపోగలిగినా నేను మరచిపోలేను. నీ ఇష్టం. నీ నిర్ణయానికీ, నా ఆలోచనకూ మధ్య రెండు రోజులు టైము చాలు. నా ఆలోచనల్లో మార్పొస్తే నీ పరిధిలోకి నేను రాగలను. నా ఆలోచనలు రైటనుకున్నా, నీ నిర్ణయం తప్పనుకున్నా మన పరిధి నువ్వు దాటలేవు. బాగా ఆలోచించి నిర్ణయం తీసుకో'' అంటూ ఫ్రెండ్ మ్యారేజికంటూ వెళ్ళింది.

విరజ చాలా పట్టుదలగల మనిషి. మ్యారేజి అనేది వంక మాత్రమేనని తనకు తెలుసు. ఆ వంకతో తను గడువుపెట్టిన రెండురోజుల తరువాతనే మళ్ళీ తన ఎదుట పడేది.

నిజాన్ని ధైర్యంగా ఒప్పుకోవలసి వస్తే విరజ హెచ్చరికలో ఈషణ్మాత్రం పొరపాటులేదు. గతాన్ని మరచిపోతే తప్పు... మరువగలిగితే తప్పు విరజ హెచ్చరికలో పొరపాటుంటుందని ఎలా అనుకుంటుంది? కాని...

తన ఆలోచనలు ఓ కొలిక్కి రాకముందే, పరిష్కారం దొరక్కముందే విరజ ఇచ్చిన గడువులో అప్పుడే ఇరవై నాలుగ్గంటలు గడిచిపోయాయి. మరో ఇరవై నాలుగ్గంటల్లో తన నిర్ణయం అటోఇటో తేలిపోవాలి. విరజ గీచిన గీటు దాటటమో, పరిధిలోనే ఉండిపోవటమో తేల్చేసుకోవాలి.

విరజ!

లాలించి, బుజ్జగించి సమాధాన పరచటానికి వినకపోతే దండించి నోరు మూయించటానికి చిన్నపిల్లకాదు. పసితనాన్ని ఎన్నడో వదిలేసి చదువు, సంస్కారం, నిజం, న్యాయం క్షుణ్ణంగా అలవరచుకున్న పరిపూర్ణ యువతి. నవీన భావాలు సంతరించుకుని సమస్యల్ని ధైర్యంగా ఎదుర్కోగల నేటి యువతి. ఈనాటి మేటి యువతి!

సరిగ్గా రెండురోజుల క్రితం....

తూరుపు రేకలు విచ్చుకుంటున్నాయి.

ముఖ్యమైన పనివుండి తనావేళ హడావుడిగా తయారై పోర్టికోలోనున్న కారు సమీపిస్తుండ

గా—

"కోమలీ..." అన్న పిలుపు తనకాళ్ళకు సడన్ బ్రేకు వేసింది.

అంతే కాదు... ఆ పిలుపు గుండె లోతుల్ని తాకి మరో మత్తయిన లోకానికి.... లాక్కెళ్ళింది. తను పదవిలోకొచ్చి వృత్తి స్వీకరించాక అంత సన్నిహితంగా, హితంగా, చనువుగా ఏకవచనంతో పిలిచిన వ్యక్తులెవరూలేరు. అంత చొరవ ఇంకెవరికో మాత్రం ఎలా ఉంటుంది?

ఇంకెవరు?

చివ్వున తిరిగి చూచింది.

బాగా పెరిగిన గడ్డం.... నలుపు తెలుపు కలయికతో.... దుబ్బుగా పెరిగి నిర్లక్ష్యంగా వదిలేసిన తల వెంట్రుకలు... ఆ గుబురులో లోతుగా పీక్కుపోయిన కళ్ళు.... జీవం కోల్పోయినట్లున్న కనుగుడ్లు.... పేలవంగా జాలిగొలిపే చూపులు...

ఆ చూపులు....

ఆ చూపులు కోమలాదేవి గుండెలోతుల్లో... ఎదలోయల్లో.... ఎక్కడో... ఎక్కడో బలంగా గుచ్చుకుంటున్నాయి.

చప్పున చూపు మరల్చి నిలువునా పరుగులెత్తించింది.

మనిషికంటే బాగా మాసిపోయిన బట్టలు రంగు తెలీకుండా మాపు స్పష్టంగా కనిపిస్తూంది. కాళ్ళకు ఆకు చెప్పులు కూడా లేవు. పాదాలు పగుళ్ళిచ్చి మట్టి కొట్టుకుని అసహ్యంగా....

కోమలాదేవి చూపులు మళ్ళీ పైకి జరిగాయి.

పెరిగిన గడ్డం ఆక్రమించుకున్న స్థలం మినహా మిగిలిన కాస్త చోటు ఉబ్బరించినట్లు, వయసుకు మించిన వార్ధక్యం మీద పడినట్లు....

"ఎవరూ?" కోమలాదేవి ప్రశ్నించింది గోల్డ్‌ఫ్రేం కళ్ళద్దాలు సవరించుకుంటూ.

అతను సమాధానం కోసం వెతుక్కుంటున్నాడు.

"ఎంతవారించినా వినలేదు మేమ్‌సాబ్. లోనికి ఒక్కసారి పోనివ్వమని గంటనుండి ఒకటే ఏడుపు పిచ్చి వాడిలా. చివరికి కాళ్ళుకూడా పట్టేసుకున్నాడు. నాకే జాలివేసి..." తన భాషలో వివరిస్తూ నేరస్థుడిలా

## మూడు రూపాయల హత్య



ఆకాశం మనిషిని రాక్షసుడిగా ఎలా చేస్తుందో ఈమధ్య కర్నాటకలోని 'కెరే మంగళ్' అనే గ్రామంలో జరిగిన ఓ హత్య సరైన విదర్శనం. ఆ గ్రామంలోని చెంగప్పనుంచి సీతారామప్ప అనే వ్యక్తి మూడు రూపాయలు అప్పు తీసికొన్నాడట! ఓరోజు చెంగప్ప వెళ్ళి తన డబ్బు అడిగాడు. మాటా మాటా పెరిగింది — ఆ ఆవేశంలో చెంగప్ప – సీతారామప్పను పొడిచి చంపేశాడు! పాపం సీతారామప్ప! మూడు రూపాయలకోసం నూరేళ్ళు నిండిపోయాయి కదా!

—జూపిటర్

సంజాయిషీ ఇచ్చుకుంటున్నాడు గూర్ఖా వెనకగా వచ్చి.

అప్పుడు విప్పాడు అతను... నోరు!

"నేను కోమలీ.... నీ...."

అంతే! ఆమె మనసులో వెన్నెల పారిజాతాలు కురిపించినట్లయింది. అంతటితో అతని నోరు కట్టుబడిపోయినా అతని నోటినుండి వెలువడిన "నీ" అనే ఒక్క అక్షరం నిలువెల్లా తనను కట్టిపడేసింది. ఆ ఒక్క అక్షరం మనసు పొరల్ని చీల్చుకుని చొచ్చుకుపోయి అతి సున్నితమైన స్థలంలో...

తగలవలసిన చోట తగిలింది....

అదే"ఆ" రోజుల్లో అయినట్లయితే మనసు ఆనందంతో చిందులువేసేది. పరవశంతో కదం తొక్కేది. క్షణంలో వెయ్యోవంతు కోమలాదేవి గుండె స్థానభ్రంశం చెందింది.

"తుమ్‌జావ్" తమాయించుకుని గూర్ఖాను ఆదేశించింది.

అంతవరకూ తననేమంటుందోనని భయపడిన గూర్ఖా గుండె దిటవుపడి సెల్యూట్‌కొట్టి వెళ్ళిపోయాడు. రెప్పకూడా ఆర్పకుండా "అతని" కళ్ళు కోమలాదేవిని నిలువెల్లా పరికిస్తున్నాయి.

"లోపలికి రండి" గుండె అట్టడుగు పొరల్నుండి ఎగసి వచ్చిందా పదం.

అతను మంత్రించినట్లు అనుసరించాడు క్షణం జారిపోనివ్వకుండా. పైకి తీసికెళ్ళి బాత్‌రూం చూపించింది. ఏనాడో పదిలంగా గుప్తంగా దాచిన పాలనురగలాంటి తెల్లని లాల్చీ, పైజమా బైటికి తీసింది. వాటిని స్పర్శిస్తూంటే... అంతవరకూ బిగబట్టి దాచుకున్న కరుడుకట్టిన బాధ కరిగి వరదలై ప్రవహించింది. మొదటి చినుకు రాలేంతవరకే కష్టం. ఆ తరువాత వరసపెట్టి, ధారలు కట్టి ఏరులై పారుతుంది. వరదలై పొంగుతుంది. గట్లు తెగిన ప్రవాహంలా రెప్పల్ని దూసుకుంటూ చెంపలమీదుగా జారి గుండెల్ని తడిపేస్తున్నాయి కన్నీళ్ళు.

అది పళ్ళ బిగువున వెలువడే మౌనరోదన! నిశ్శబ్ద మనోవేదన! హృదయ ఘోష! గుండెకో! అతను డ్రస్సయ్యే సరికి టిఫిన్, టీచేసి పెట్టింది మౌనంగానే. వేడివేడి టిఫిన్, టీ పేగుల్లోకి జారేసరికి అతని కొడిగట్టినట్లున్న ప్రాణం ఊపిరి పోసుకుంది.

నరాల్లోకి కొత్త శక్తి వచ్చి ఎంతో సేద తీరినట్లయింది. ఐనా... ఆమె మౌనం, ఆ ఇద్దరి మధ్య రాజ్యమేలుతున్న నిశ్శబ్దం అతని గుండెను నలిపి పిప్పి చేస్తున్నాయి. మనసును కోసేస్తున్నాయి. అలా కాకుండా....

ఆమె పెదవి విప్పి ఒక్కమాట మాట్లాడి క్రోధంతో రెచ్చిపోయి నోటికొచ్చినట్టల్లా దూషించినట్లయితే... అతని మనసు శాంతించేది. అతని హృదయం తృప్తి పడేది. అదేమీ లేకుండా తన కర్తవ్యం బాధ్యతగా నిర్వర్తిస్తున్నట్లు శ్రద్ధగా, మౌనంగా చేసుకుపోతూంది. తను మౌనిలా యాంత్రికంగా చేసుకుపోతున్నాడు. మొదటినుండీ ఆమెకదే అలవాటైనా అతనికి మాత్రం ఇప్పటి తన ప్రవర్తన కొత్తే. ఒకప్పుడు ఆమె భయంతో గడగడలాడుతూ చేసేది. అధికారంతో బెదిరించి, భయపెట్టి అతను చేయించుకునేవాడు. అప్పటికీ ఇప్పటికీ అదే తేడా!

విశాలమైన గదిలో ఫోంబెడ్ చూపుతూ

"వాకు పైప్రైంది. విశ్రాంతి తీసుకోండి" అంటూ వెళ్ళిపోయింది.

అంతమాత్రం మాటకే గాలి బుడగలా ఉబ్బిపోయి మానసికంగా డస్సిపోయివున్న అతను శారీరకంగా శుచియై కడుపునిండేసరికి బెడ్‌మీదికి చేరగానే సొలిపోయినట్లు నిద్రలోకి జారిపోయాడు.

పైప్రైందని వెళ్ళటానికైతే వెళ్ళిందిగాని ఉండలేక సిక్‌లీవ్ పెట్టి వెంటనే వచ్చేసింది.

సాయంత్రం ముఖ్యమైన పనిమీద నిన్నన నగా వెళ్ళిన విరజ ఇల్లు చేరుతూనే మేడమీదికి దూసుకువెళ్ళి "మమ్మీ" అంటూ అల్లరిగా పిలవబోయి బెడ్‌రూంలో ఆదమరచి నిద్రిస్తున్న అపరిచిత వ్యక్తిని చూచి అదే వేగంతో బైటికి వస్తూనే

"మమ్మీ! ఎవరతను?" అన్నది.

విరజ రాగానే తనెదుర్కోవలసిన మొట్ట మొదటి ప్రశ్న అదేనని ముందే ఊహించిన కోమలాదేవి నింపాదిగా సూటిగా, నిశ్చలమైన చూపుల్తో

"మీ... నా... న్నగారు" అన్నది నిబ్బరాన్ని కూడదీసుకుంటూ.

ఒక సమస్యను ఎదుర్కోబోయేముందు ఒక సాకునో, ఒక అబద్ధాన్నో సృష్టించి అడ్డం పెట్టుకుని దాన్ని కప్పిపుచ్చటానికి మరో వెయ్యి అబద్ధాలకు దారులు వెతకటం ఆమె సిద్ధాంతానికి విరుద్ధం. అబద్ధాన్నైనా సూటిగా నిజంతో ఎదుర్కోవాలన్నది ఆమె పాలసీ, అందుకే కన్నబిడ్డ విరజ అడిగిన ప్రశ్నకు సూటిగా సమాధానమిచ్చింది. ఆ ఊహించని సమాధానం వింటూనే విరజ ముద్దుముఖం కందగడ్డలా మారి తల్లిముఖంలోకి విచిత్రంగా చూచింది. ఆ పిల్ల కళ్ళు విశాలమయ్యాయి.

"వ్హా....ట్ మమ్మీ!... నా....న్న.... గారా?! అంటే?!.... సదరు మీ భర్తగారు. యామై కరక్ట్?" ప్రతీ అక్షరం ఒత్తిపలుకుతూ దీర్ఘం తీస్తూ రోషంగా చూస్తూ అన్నది. అలా అంటున్నప్పుడు ఆ పిల్ల కళ్ళు



మంకెనపువ్వుల్లా మారి విస్మయంతో వెడల్పయ్యాయి.

"ఔను విరజా" తొణక్కుండా స్థిరంగా పలికింది కోమలాదేవి కంఠం.

"వాటెవండర్!? చాలా ఆనందంగా ఉంది మమ్మీ అని... ఎగిరి గంతేస్తాననుకున్నావు కదూ మమ్మీ?" తల్లి కన్నుల్లోకి చాలా లోతుగా చూస్తూ కరుగ్గా అడిగింది.

ఔనూ కాదూ అనేది స్పష్టంకాకుండా తల పంకించిది కోమలాదేవి.

"హు" అని హుూంకరిస్తూ చరచరా నడచి తన గదిలోకి వెళ్ళిపోయింది విరజ.

విరజ చాలా తెలివైనపిల్ల. పైగా 'లా' చదివింది. ప్రతిపాయింట్‌నీ ముద్దాయి కోణంలో నుండి పరిశీలిస్తూ న్యాయ నిర్ణయం చేయగల దిట్ట. ఆ ఒక్క నిట్టూర్పుతోనే తన నిర్ణయాన్ని తెలిపేలా చేసింది. అంటే..

అంటే... ఆ వ్యక్తి ఈ కాంపౌండ్‌లో కనీసం కాలుకూడా పెట్టటం ఇష్టంలేదని స్పష్టంగా తెలియజేసిందన్నమాట. ఇక ఆ ఆవేశపు ఉధృతం తగ్గేవరకూ మాట్లాడే ఆస్కారమే ఇవ్వదు. తనలో తనే మధనపడిపోతూంది కోమలాదేవి.

ఆ రాత్రి భోజనం వడ్డిస్తుండగా అతను చెప్పిన విషయం కోమలాదేవి గుండె బరువును మరీ పెంచింది. తను విభ్రాంతి నుండి కోలుకోకముందే అతనే కలుగజేసుకుని—

"కోమలీ! రెండురోజులాగి మళ్ళీ నీకు కనిపిస్తాను. అప్పుడు నీ నిర్ణయం తెలియజెయ్యి" అంటూ వెళ్ళాడు. కోమలాదేవి నోటిమాట కూడా రాక చిత్తరువులా చూస్తుండిపోయింది. ఆమె గుండె పొరల్లో నుండి పెల్లుబికిన కన్నీరు బైటికి రావటాని క్కూడా భయపడి కనుద్వయంలోనే నిలిచి ఘనీభవించినట్లయ్యాయి.

* * *

తల్లి మంచినీళ్ళు కూడా మామూలుగా తాగలేకపోతూందని విరజకు తెలుసు. తల్లి చేసిన పనికి అలా బింకంగా ఉండిపోయిందే గాని లేకపోతే తల్లి తినకుండా తనేనాడైనా ఒంటరిగా భుజించిందా? తల్లి ఉదాసీనంగా ఉన్నట్లు నామమాత్రంగా గ్రహించినా తనే నాడైనా ఆదమరచి నిద్రించిందా? తల్లి మామూలు మనిషయ్యేవరకూ తను అల్లరి చేష్టలతో, చిలిపి కవ్వింపులతో, కొంటె మాటలతో కవ్వించి, నవ్వించి ఆకట్టుకుని కలిసి భోంచేసే వరకూ పోరాడేది కదూ? అలాంటిది?...

"భోంచేద్దాం రా మమ్మీ."

విరజ బింకంగా పిలిచినా మంత్రముగ్ధలా లేచి విరజను అనుసరించి డైనింగ్ టేబుల్ దగ్గరకు నడిచింది. తను తింటూనే తల్లి ఎంతవరకూ తింటుందా అనేది ఓరకంటితో గమనిస్తూనే ఉంది. విరజ భోజనం పూర్తయ్యే వరకూ ప్లేట్‌లో ఉన్న నాలుగు మెతుకులూ ముని వేళ్ళతో కెలుకుతూనే ఉంది కోమలాదేవి. తల్లిలో చెలరేగుతున్న మనస్సంఘర్షణ అవలోకిస్తూనే ఉంది.

తన గదిలో ఇదమిత్థంగా తేలని ఆలోచనలతో సతమతమౌతున్న తల్లి దగ్గరకు వేడివేడి పాలగ్లాసుతో వచ్చింది.

"అమ్మా!"

తుళ్ళిపడుతూ లేచి కూర్చుంది కోమలా

దేవి.

తల్లితుళ్ళింత తనను చూచిన భయంతో అనుకుంది విరజ. ఆ భయానికి కారణం తండ్రిని గురించి తను నిలదీయటం అని కూడా అనుకుంది.

ఏమని పిలిచింది విరజ?

అ...మ్మా... అమ్మా అని కదూ పిలిచింది?!!

భరతభూమిపై పుట్టి స్వచ్ఛమైన మాతృ భాషలో "అమ్మా" అని పిలిస్తే భాషకే అవమానం జరిగినట్లు భావిస్తూ స్టేటస్ కోసం లైఫ్‌లో కొంతభాగం విదేశాలకి అంకితంచేసి పుట్టి పెరిగిన ప్రదేశం మరచి పరభాషను పుట్టిన గడ్డపైకి మోసుకొచ్చి తమ మేధా సంపత్తిని ఆ భాషలో గుప్తిస్తూ "మమ్మీ డాడీ" అని పిలుస్తున్న ఈ నాగరికతా కాలంలో ఊహ తెలిసిన తరువాత విరజ తొలిసారిగా అచ్చ తెలుగులో "అమ్మా

అని కదూ పిలిచింది? ఆ తియ్యని తేట తెలుగులో ఎంతటి ఆత్మీయత, ఎంతటి మాధుర్యం దాగి ఉన్నాయి? మాతృత్వంలో ని పరిపూర్ణత్వం అంతా ఆ ఒక్క 'అమ్మా' అన్న పిలుపుతోనే సిద్ధిస్తుందా అన్నంత తియ్యదనం ఉందా పిలుపులో.

"వి...ర...జా!!" అది తన్మయత్వమో, పరవశత్వమో, విస్మయమో, విభ్రాంతో తెలీని ఆయోమయ స్థితిలో అన్నది ఆ తల్లి.

"భోజనం కూడా చేయలేదు. పాలు తాగమ్మా" అంటూ పక్కన కూర్చుని గ్లాసు నోటికందిస్తూ అప్పుడు చూచింది తల్లిని పరిశీలనగా.

బాగా నీరసించి ఎన్నో లంఖణాలు చేసినట్లు మొహం పీక్కుపోయి కళతప్పింది.

కన్నకూతురు చూపించే ఆప్యాయతకు, ఆదరణకు అసలే కన్నీరు కారుస్తున్న గుండె కరిగి నీరైందేమో అడగ్గానే గ్లాసుకి చప్పున పెదాలందించింది.

అమృతం లాంటి పాలు గొంతులోకి దిగుతున్నా గుండెను రగిలిస్తున్న బాధ లావాలా పొంగి కళ్ళనుండి వెచ్చగా జారుతో ంది. ఖాళీ గ్లాసుందుకుని పక్కనపెట్టి మెత్తని టవల్‌తో తల్లి కన్నీరు అద్దింది. గుండెల్లో పెల్లుబుకుతున్న బాధనంతా ఆ టవల్ పీల్చేసినట్లు మనసుకొంత తేలికైంది.



స్వర్గం

చనిపోయి నరకానికి వెళ్లాడు ఆత్మారావు. హాయిగా నవ్వుతూ ఉన్న ఆత్మారాంని చూసి—

"అదేవిటయ్యా. నీకు నరకమంటే భయం లేదా? నవ్వుతున్నావ్?" అడిగాడు యమధర్మరాజు.

"ఏవిటీ... ఇది నరకమా. స్వర్గమనుకున్నాను. మా ఇంటికన్నా బావుంది" చెప్పాడు ఆత్మారావు.

—శ్రీధర సుధాకర్ (బరంపురం)

పాల తాలూకు వేడి నరాల్లోకి పాకగానే శరీరం కొద్దిగా శక్తి పుంజుకుంది. మేను దానంతట అదే పక్క మీదికి ఒరిగింది. అలా ఒరగటంలో గాఢమైన నిట్టూర్పొకటి వెలువ డింది!

"రెస్ట్ తీసుకోమ్మా" బ్లాంకెట్ కప్పి వెళ్ళటానికి ఉద్యుక్తురాలౌతూ అన్నది విరజ

అది గ్రహించిన కోమలాదేవి వెళ్ళవద్దన్న ట్లు చెయ్యి పట్టుకుని మృదువుగా "విరజా" అన్నది కూర్చోమని పక్కన చోటిస్తూ.

విరజ మౌనంగా కూర్చుంది. తల్లిముఖం లో ప్రస్ఫుటమయ్యే బాధనీ, భావాన్నీ చదివేస్తూంది మనసుతో. బైటకి వ్యక్తం చేయలేని బాధ, విపులీకరించలేని భావం గుండెల్లోనే ఆగిపోయి జీర్ణం కాలేక కరిగి కన్నీళ్ళుగా మారి ఆ తల్లి కళ్ళల్లో పొంగాయి.

కన్నబిడ్డ విరజ దగ్గర మనసు బైటపెట్టి చెప్పుకోలేని దుర్భర నరకం తనలో తనే అనుభవిస్తూ సతమతమౌతూంది ఆ కన్నత ల్లి. అది గ్రహించిన విరజ తనతో చెప్పటాని కి గొంతు పెగిలిరాక ఆత్మాభిమానంతో తల్లడిల్లి పోతున్న తల్లిని జాలిగా చూస్తూ — "చెప్పమ్మా" అన్నది అనుజ్ఞ ఇస్తున్నట్లు.

"వి... ర... జా! ... మీ... నా.... న్న... గా... రు... మనతోనే ఉంటానంటు న్నారు" ఆ తరువాత గొంతు పూడిపోయిం ది.

భగవాన్! నువ్వనేవాడివి వుంటే ఇలాం టి దుర్భర సంఘటనలను కూడా సహించగ లవా?

"అమ్మా! నేను కొన్ని విషయాలడుగు తాను బాధపడకుండా నిజం చెప్పగలవా?" పిల్లైనంత సౌమ్యత కంఠంలోకి తెచ్చుకుని అన్నది. తను కన్నబిడ్డ! తన పేగు తెంచుకు ని పుట్టిన బిడ్డ!! తన నలా అడిగేసరికి కోమలాదేవి గుండె విలవిల్లాడిపోయింది.

"అడుగమ్మా!"

ఆ క్షణంలో తల్లిని చూస్తే అమిత జాలి కలిగింది. పదినెలలు గర్భంలో పెట్టుకుని పదిలంగా మోసి కని కంటిపాపలా కాపాడి కళ్ళలో వత్తులు వేసుకుని పెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు గరపి ఉన్నత స్థానాన నిలబెట్టి న కన్నతల్లి! ఇవాళ తన నిర్ణయం కోసం తహతహలాడుతూ ఎదురు చూస్తూంది. అప్రయత్నంగా విరజ కళ్ళు చెమర్చాయి.

"అమ్మా! పురుషోత్తమరావుగార్ని ను వ్వు మనసారా ప్రేమించి పెళ్ళి చేసుకున్నా వు కదూ?"

"ఊఁ" ఆమెలోని అణువణువూ ప్రకం పనతో ఒణికిపోతూంది.

"ప్రతి ఫలంగా ఆయన నీకిచ్చింది కూడా ప్రేమేనని నువ్వనుకున్నావుకదూ?

కోమలాదేవి గుండె మంచు పర్వతంలా గడ్డ కట్టుకుపోతూంది. నోటమాటరాలేదు. విరజ ఆమె మాట్లాడేందుకు ఆస్కారం కూడా ఇవ్వలేదు.

"ఆయన నిన్ను నిన్నుగా ప్రేమించలేద నీ, ఏకైక వారసురాలిగా నీ ఆస్తినీ, నీ సంపాదననీ దృష్టిలో పెట్టుకుని, నీ ప్రేమని బలహీనతగా తీసుకుని పెళ్ళయ్యేవరకు ప్రే మించినట్లు నటించి పెళ్ళితో నిన్ను కైవసం

చేసుకుని నీ సంపాదన మీద తనకి అధికారం ఇవ్వలేదనే చిన్న కారణంగా గర్భవతివనే కనీస జాలికూడా లేకుండా నిర్దాక్షిణ్యంగా నిన్ను వదిలి తన 'సుఖం' తాను చూసుకున్నాడన్న విషయం కూడా నువ్వు మరచిపోలేదుగా?''

''విరజా'' గుండె ఇనుప పిడికిళ్లో పెట్టి నలిపేసేంత బాధ.

''నిన్ను బాధపెడుతున్నానని నాకు తెలుసమ్మా. నిన్ను బాధపెట్టాలనే ఉద్దేశ్యం మాత్రం కాదు నాది. నీ మనసులో చెలరేగుతున్న సంఘర్షణ నాకు తెలుసు. నేను అంగీకరిస్తే నీ భర్తను మనతోపాటే ఉంచాలనుకుంటున్నావని కూడా నాకు తెలుసు. కానీ... నాకు నేనుగా అతన్ని వద్దనిగానీ, అంగీకరించమనిగానీ చెప్పను. కారణం చెప్పవలసివస్తే నిజంగా నా తండ్రి ఎలా ఉంటాడో కూడా నాకు తెలీదు. ఈ రోజు నువ్వు చెప్తే నా తండ్రిగా తెలిసిన మనిషి అతను. నేను పుట్టి పెరిగి ఊహ తెలిసిననాటి నుండీ తల్లీతండ్రీ వేరువేరుగా ఉంటారని నాకు తెలీదు. తండ్రిని కూడా నేను నా తల్లిలో చూసుకుని పెరిగినదాన్ని. ఒకవేళ నీ నిర్ణయం అటువైపే వుంటే మనిద్దరం కలిసి ఉండటం దుర్లభం. నీ నిర్ణయానికీ, నా ఆలోచనకీ మధ్య రెండురోజులు టైము చాలనుకుంటున్నాను. నా ఆలోచనల్లో మార్పొస్తే నీ పరిధిలోకి నేను రాగలను. నీ నిర్ణయం తప్పనుకుంటే మన పరిధి నువ్వు దాటలేవు'' అంటూ ఫ్రెండ్ పెళ్ళివంకతో వెళ్ళిపోయింది.

విరజ ఈతరం స్త్రీమరి. ఆడ పిల్లయినా సమస్యల్ని ధైర్యంతో ఎదుర్కోగల సాహసి. వేగంతోపాటు దుడుకుతనమూ సమపాళ్ళలోనే ఉంది. ఐనా...

ఔను... ఒక సంపన్నుని సంపదకి ఏకైక వారసురాలిగా తను అతన్ని మనసారా ప్రేమించి పెళ్ళి చేసుకుంది. తన కలలు నిజాలై కళ్ళముందు నిలిచినందుకు ఉప్పొంగిపోయింది. ఆనాటి తన ఆలోచనలు ఎలా ఉండేవి. జీవితం ఒక ప్రమిదైతే ఆడది... అఫ్‌కోర్స్... భార్య వెలుగునిచ్చే వత్తయితే



## ముసలి పెళ్ళి

పెళ్ళనేది నూరేళ్ళపంట అనేది ఓ నానుడి. అయితే నూరేళ్ళు నిండిన తర్వాత ఒకాయన పెళ్ళి పీటలమీద కూర్చున్నాడంటే నమ్మగలరా? అవునండీ... యుగొస్లేవియాకు చెందిన డ్యూరా అనే 101 సంవత్సరాల ముదుసలి – యులా అనే 95 సంవత్సరాల మరో ముసలి వధువును 1963లో పెళ్ళాడాడు.

ఇంతవరకూ ప్రపంచంలో అయిన పెళ్ళిళ్ళలో అతి ముసలి పెళ్ళి ఇదేట! అయినా వీరిద్దరికీ ఆ వయసులో ఇలాంటి కోరిక కల్గినందుకు మెచ్చుకోవల్సిందే!

—జూపిటర్

భర్త వత్తిని వెలిగించేందుకు ఆధారమైన నూనె కావాలి. ఆ రెండూ ప్రమిదలో కలిసి ఉన్నట్లుగా తామిద్దరూ పరస్పర అవగాహనతో జీవితంలో ఇమిడిపోయి ఒక్కటిగా... ఒక్కరుగా కలిసిపోయి... కలిసిమెలసి.... మరి తన జీవితం?....

ఒక ప్రక్క తనను కపటనాటకంతో గెలుచుకుంటూనే తన ఆస్తిమీద, తన సంపాదన మీద వలపన్నటం మొదలెట్టాడు. అతని కుటిలత్వం ప్రారంభలోనే గ్రహించిన తన తండ్రి అప్రమత్తుడై జాగ్రత్తచేసి కన్నుమూశాడు. అతన్ని గాఢంగా ప్రేమించిన నేరానికి సహించటం, భరించటం నేర్చుకుంది. చివరికి ఒక రోజు ఆస్తి దగ్గర తీవ్రంగా ఘర్షణపడి గర్భవతినైనా చూడకుండా పశువులా ప్రవర్తించి వేరేమార్గం అనుసరించాడు. తన సుఖం తాను చూచుకుని నిర్దాక్షిణ్యంగా వదలివేశాడు. ఆ తరువాత ఎంతగా ప్రయత్నించినా తిరిగైనా చూడలేదు.

చివరికి ఆశలు వదులుకుని చదువుకొనసాగించి పవిత్రమైన న్యాయాధికార వృత్తి చేపట్టింది. తీరా ఇన్నేళ్ళకి తనంతట తానే...

కోమలాదేవి ఎటూ తేల్చుకోలేక పోతూంది. ఎంతైనా ఏరికోరి కావాలనుకుని కట్టుకున్న భర్త! ఇటు చూస్తే తన కష్టాలు కన్నీళ్ళు ఔపోసన పట్టినట్లు తన జీవితానికి ఆసరా, ఆలంబన కావాలనే దృష్టితో పెళ్ళి మీదికి కూడా దృష్టి మరల్చకుండా పట్టుదల దీక్షతో చదివి ఉన్నత స్థితికి చేరుకుంటున్న కన్నబిడ్డ!

* * *

విరజ ఆలోచనలు మరోవిధంగా ఉన్నాయి.

ఏమిటి అమ్మ నిర్ణయం??

"విరజా! నేను కోరి కావాలని చేసుకున్న ఆ పెద్దమనిషి... అదే... మీ నా...న్నగారు మిస్టర్ పురుషోత్తమరావుగారు... పాపం! ఇన్నేళ్ళకి మనం గుర్తొచ్చి భార్యాబిడ్డలు కావాలంటూ వెతుక్కుంటూ వచ్చారు. ఈ విషయంలో ఏనాడో నా మనసును చంపేసుకున్నాను. ఒక వేళ నీకేదైనా తండ్రిగా జాలి, సానుభూతి, అభిమానం లాంటివేవైనా ఉండి మన దగ్గర చోటివ్వాలని నీ కనిపిస్తే అది నేను మాత్రం సహించను. తక్షణం ఇక్కణ్నుంచి వెళ్ళిపొమ్మనే చెప్తాను. ఆ తరువాత అపనింద నా మీద వేస్తేమాత్రం నేనొప్పుకోను" అని తనకే వార్నింగిస్తుందనుకున్న అమ్మ తన భర్తను చూడగానే ఇంత బేలగా, అబలగా మారిపోయిందేమిటి?

ఇదేనా హిందూస్త్రీ సంస్కృతి అంటే?

ఇదేనా భారతనారీ సంస్కారంఅంటే?

ఇదేనా స్త్రీ బలహీనత?

అందునా విశిష్టమైన, పవిత్ర పదవి చేపట్టి న్యాయమూర్తి స్థానంలో ఉండికూడా తనదాకా వస్తే అతి సామాన్య స్త్రీగా మారిపోగలదా ఆడది? అతి సాధారణ స్త్రీగా మారిపోగలదా ఆడది?? ఆ సామాన్యస్థానం నుండి అతి సామాన్య స్థాయికి దిగజారుతుందా ఆడది??? మగవాడి అమానుషాలను సహించి అరాచకాలను సమర్థి

స్తుందా స్త్రీ? స్త్రీ అంటే అర్థం ఇదేనా?

ఇలాంటి బేలలు అబలలు ఉన్నంతకాలం అలాంటి మగజాతి ప్రజ్వరిల్లుతూనే ఉంటుంది. నో... అలా జరగటానికి వీల్లేదు. అమ్మ నిర్ణయాన్ని తనేమాత్రం సహించదు. సహించబోదు. పేరులో మాత్రమే పురుషోత్తముడని ఉన్న ఆ పురుషోత్తముణ్ణి మగజాతికి బుద్ధొచ్చేలా, కనువిప్పు కలిగేలా పోరాడి అణగద్రొక్కాలి. అతన్ని తండ్రిగా అనుకుంటేనే రక్తం ఉడికిపోతూంది. తలచుకుంటేనే గుండె పాషాణం కంటే కఠినంగా మారిపోతూంది. అతనా తండ్రి? తండ్రంటే అలాగా ఉండేది? తండ్రి అనే పేరుకే అవమానం తెచ్చేంత అమానుషుడు తన తం...డ్రి.

* * *

"ఏం నిర్ణయించుకున్నావు మమ్మీ?" రెండురోజులు గడువు తీరిపోగానే వచ్చి అడిగింది విరజ.

వెంటనే జవాబు చెప్పలేక-


"నాకేమీ తోచటం లేదమ్మా విరజా" గుండెను కూడదీసుకునే ప్రయత్నం చేస్తూ.

"పోనీ నీ నిర్ణయం చెప్పు" అన్నది తనే.

"చెప్పమంటావా అమ్మా?"

"చెప్పామ్మా."

"అమ్మా! అతన్ని గురించి నీ మనసులో ఏమనుకుంటున్నావో నాకు తెలీదుగానీ ఇది నిజం. పచ్చి నిజం. ఇవాళైనా నీ మీద ప్రేమతో అతను రాలేదు. తన అవసరాలకు నిన్ను వెతుక్కుంటూ వచ్చాడు. నీ మీద వీసమెత్తు ప్రేమైనా ఉన్నవాడైతే... నీ డబ్బు విషయం వదిలేస్తే అతని పక్కన మరో మనిషికి స్థానమిచ్చేవాడే కాదు. నీ మీద ప్రేమ గలవాడే ఐతే నీ విరహంలోనే వేగి కృశించి నశించేవాడేగాని మరో మనిషితో కులికేవాడే కాదు. ఇప్పుడు అతని పరిస్థితి



ఏమిటంటే... వయసు కాలిపోతూ, ఓపిక ఉడికిపోతూ, శరీరం శిథిలమౌతూ, దేహం సుఖస్పర్శను కోల్పోయే స్థితికి చేరుకోబోతూంది. వృద్ధాప్యం అతని అందాన్ని మింగేస్తూంది. వయసు ఓపిక ఉండి నిన్ను సుఖపెట్టవలసిన రోజుల్లో కన్నూమిన్నూ కానక నిన్నొంటరిదానిచేసి తను విచ్చలవిడి జీవితం అనుభవించినా ఈ జీవిత చరమదశలో అతనికి ఒక అండ కావాలి. ఒక ఆలంబన కావాలి. ఒక తోడుకావాలి. ఒక నీడకావాలి. అది నీ రూపంలో ఇక్కడ ఉందని అతనికి బాగా తెలుసు. అది ఒక్క నీవల్లనే సాధ్యమౌతుందనీ అతనికి తెలుసు. ఆనాడు నీకు అతని మీదున్న ప్రేమని ఆలంబనగా తీసుకుని నిన్ను జయించాడు. ఈనాడు నీకు లొంగినట్లు నటించి నిన్ను గెలవాలని చూస్తున్నాడు. ఇన్నేళ్ళ నీ వైవాహిక జీవితంలో ఏ ఒక్క రోజైనా నువ్వు బ్రతికున్నావో లేదో, తిన్నావో లేదో అని ఆలోచించాడా? అసలతనికి తనకొక బిడ్డ కలిగిందనైనా తెలుసా? ఎందుకమ్మా ఈ ఆత్మవంచన? ఇన్నేళ్ళూ తండ్రెవరో తెలీకుండా పెరిగి పెద్దదాన్నై ఇప్పుడు తండ్రీ బిడ్డలుగా పరిచయం కాబడటం నాకిష్టంలేదు.

అతనిమీద ప్రేమని చంపుకో లేక నువ్వతన్ని చేరదీసినా నేనందుకు సిద్ధంగా లేను.

ఈ ఒక్క విషయం తప్పిస్తే నువ్వు నాకు కావాలి. అతను బ్రతికివున్నా మనకు లేనివాడేనమ్మా. మనకు ఎవరూ లేరమ్మా. నాకు నువ్వూ, నీకు నేనూ. నీకు నేనున్నానమ్మా'' అంటూ చరచరా బైటికి వెళ్ళిపోయింది.

కోమలాదేవి హృదయం రోదించింది మూగగా. ఆయన తనను విడిచి వెళ్ళినా ఇన్నేళ్ళూ విరజను చూసుకునే ప్రాణాలు నిలబెట్టుకుంది. విరజ కోసమే బ్రతికింది. అలాంటి ప్రాణప్రదమైన విరజ తనను విడిచి వెళితే? ఆ ఊహే భరించలేకపోయింది. ఒక్క గాఢమైన నిట్టూర్పుతో బాధను కొంత ఉపశమింపజేసుకుంది. ఆకాశం నుండి ఓ ఉల్క రాలుతూ భూమ్మీద పడకముందే ఆరిపోయింది. మర్నాడు తన గది గడపలో పడివున్న కాగితం చేతికి తీసుకుంది.

''కోమలీ! రాత్రి నీకూ 'నీ' బిడ్డకూ జరిగిన సంభాషణ నీ నిర్ణయం కోసం అప్పుడే వచ్చిన నేను విన్నాను. మీ మధ్య ఉండటానికి నాకే అర్హత లేదని గ్రహించాను

శలవు. ఇట్లు

పురుషుల్లో అధముడు

పురుషోత్తమ్''

అని ఉంది.

ఎండి బీటలు వారిన గుండెపై రాలిన హిమబిందువులాంటి వానచినుకు కాలుతున్న పెనంపై పడిన నీటి చుక్కలా ఆవిరైపోయింది. అది ఎప్పటికీ అంతేనేమో! అందుకు ప్రధాన కారకులు????